AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in

5-10-2026 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2

జోరందుకున్న వరికోతలు



2



పోలీస్ స్టేషన్‌లో ఆత్మహత్యాయత్నం

2

చివరి ఆయకట్టు వరకు సాగునీరు



అక్షరటుడే, బాన్సువాడ: నిజాంసాగర్ 25వ డిస్ట్రిబ్యూటరీ ద్వారా చివరి ఆయకట్టులోని రైతుల పొలాలకు సాగునీరు అందిస్తున్నామని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. బాన్సువాడ మండలం కొల్లూరు, నాగారం, బీర్కూర్ మండలం దామరంచ, అన్నారం గ్రామాల రైతుల పొలాలకు సాగునీరు సక్రమంగా చేరడం లేదని రైతులు పోచారం దృష్టికి తీసుకెళ్లారు. రైతుల సమస్యను తెలుసుకున్న పోచారం వెంటనే ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు.

చిన్నారుల ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో ముఖ్యం



అక్షరటుడే, కామారెడ్డి: చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో ముఖ్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి అన్నారు. పోషణ్ అభియాన్‌లో భాగంగా నిర్వహించిన పోషణ్ మాసం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ప్రతి కుటుంబం సమతుల్య ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, మహిళలు, చిన్నారులు పోషకాహారం, ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహార సేవలను సద్వినియోగం చేసుకోవాలని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు సీమంతం, పుట్టిన ఆడ పిల్లలకు బేబీ కిట్ల పంపిణీ, అన్నప్రాసన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ భానుప్రకాష్, సీడీపీవో సుజాత, ఇన్‌చార్జి డీడబ్ల్యూవో అధికారి వెంకటేష్, సూపర్‌వైజర్ కవిత, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బియ్యం ధరలకు రెక్కలు..



బియ్యం ధరలకు రెక్కలు వచ్చాయి. సన్న బియ్యం రేట్లు ఒక్కసారిగా భారీగా పెరిగాయి. ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో ఇబ్బంది పడుతున్న సామాన్యులపై తాజాగా బియ్యం ధరలు భారం మోపాయి. దీంతో వంట చేసుకోవాలంటనే సామాన్యులు భయపడే పరిస్థితులు నెలకొన్నాయి.

- అక్షరటుడే, కామారెడ్డి

- సామాన్యులకు చుక్కలు చూపిస్తున్న ధరలు
- కిలో బియ్యం రూ.20 నుంచి రూ.30 వరకు పెంపు
- నాలుగు నెలల్లో ఆకాశాన్నంటిన సన్నాల ధరలు
- ఆందోళన చెందుతున్న పేద, మధ్య తరగతి ప్రజలు

నాలుగైదేళ్లుగా సామాన్య ప్రజలు సైతం సన్నబియ్యానికి అలవాటు పడ్డారు. ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం సరఫరా చేస్తుండటంతో ప్రతి నిరుపేద సన్నబియ్యానికి అలవాటు పడ్డారు. దాంతో ఈ బియ్యం ధరలకు రెక్కలొచ్చాయి. గతంలో పేద, మధ్య తరగతి ప్రజలు సులభంగా కొనుగోలు చేసే సన్న బియ్యం ఇప్పుడు అందని ద్రాక్షగా మారింది. గతంలో దొడ్డు బియ్యం తినే పేదలు కూడా ఇప్పుడు సన్న బియ్యానికి అలవాటు పడటంతో డిమాండ్ భారీగా పెరిగింది. ప్రభుత్వం ఉచితంగా సన్న బియ్యం ఇస్తున్నా, కుటుంబంలో సభ్యులు ఎక్కువగా ఉండటం, పండుగలు, శుభకార్యాలకు బయట కొనాల్సి రావడంతో సామాన్యుడు బయట మార్కెట్ మీద ఆధారపడక తప్పడం లేదు. నాలుగు నెలల క్రితం వరకు కుటుంబ అవసరాలకు సరిపడా 25 కిలోల బస్తా రూ.1,250 1,500 కి వచ్చేది. ఇప్పుడు అదే బస్తా రూ.1,900 2,100 పలుకుతోంది. రోజువారీ కూలీలు, చిన్న ఉద్యోగులు, ఆటో డ్రైవర్లు బియ్యం కొనాలంటేనే ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది. నెలసరి బడ్జెట్‌లో బియ్యానికే అదనంగా రూ.500-800 భారం పడుతోందని గృహిణులు వాపోతున్నారు.

రూ.20 నుంచి రూ.30 వరకు పెంపు


ప్రస్తుతం మార్కెట్లో ప్రతి కిలో బియ్యంపై రూ.20 నుంచి రూ.30 వరకు పెరిగింది. ఇది సాధారణ పెరుగుదల కాదని, 40శాతం వరకు పెరుగుదల అని వ్యాపారులే చెప్తున్నారు. నాలుగు నెలల క్రితం కిలో రూ.50-55 ఉన్న సాధారణ సన్న బియ్యం ఇప్పుడు రూ.65-83 కి చేరింది. నాణ్యమైన బియ్యం విషయానికి వస్తే ఆర్ఎన్ఆర్ రకం రూ.74-85, బీపీటీ (సాంబా మసూరి) రూ.70-80, హెచ్ఎంటి రూ.7380, జై శ్రీరామ్, సోనా మసూరి వంటి ప్రీమియం రకాలు రూ.80-100 పలుకుతున్నాయి. కనీసం పేదలు తినే నూకల ధర కూడా కిలో రూ.20 నుంచి రూ.30 కి పెరిగింది. అంటే నెలకు 30 కిలోలు వాడే కుటుంబానికి అదనంగా రూ.600-900 భారం పడుతోంది. కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే సన్నాల ధరలు ఊహించని రీతిలో పెరిగాయి. అధికారిక లెక్కల ప్రకారం జూలైలో సగటు రిటైల్ ధర రూ.54.4 ఉండగా, అక్టోబర్ నాటికి రూ.61.6 కి చేరి 13శాతం పెరుగుదల నమోదైంది. కానీ క్షేత్రస్థాయిలో రిటైల్ మార్కెట్లో ఈ పెరుగుదల 25-30శాతం వరకు ఉంది. గతంలో ఎన్నడూ లేని విధంగా 26 కిలోల బ్యాగ్ ధర రూ.2,000 దాటడం ఇదే మొదటిసారి. ఎల్‌నినో భయంతో వ్యాపారులు రేట్లు పెంచడమే కాక, ప్రభుత్వ కొనుగోళ్లు ఎక్కువ కావడంతో బయట మార్కెట్ కు సరుకు తక్కువ వస్తోంది.

సన్న వడ్లకు డిమాండ్..

కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లోని బాన్సువాడ, బోధన్, వర్ని, రుద్రూర్, ఎడపల్లిలో ముందస్తు వరి కోతలు జోరుగా సాగుతున్నాయి. రైతులు ప్రతి ఏటా ముందే నారు పోసి, ముందే కోతలు చేస్తారు. దీంతో ఇక్కడి బీపీటీ సన్నవడ్లకు మార్కెట్లో ఎప్పుడూ డిమాండ్ ఉంటుంది. ప్రస్తుతం ఏపీ, మహారాష్ట్ర, కర్ణాటక నుంచి వ్యాపారులు, మిల్లర్లు నేరుగా కల్లాల వద్దకే వచ్చి పోటీపడి కొనుగోలు చేస్తున్నారు. తేమ 2530శాతం ఉన్నా అభ్యంతరం చెప్పకుండా నగదు ఇచ్చి తీసుకెళ్తున్నారు. వారం క్రితం క్వింటా రూ.3 వేలలోపు ఉన్న వడ్లు ఇప్పుడు రూ.3,400 3,600 పలుకుతున్నాయి. జై శ్రీరామ్ వడ్లు అయితే క్వింటా రూ.4,500 కి చేరాయి.


ఎల్-నినో ప్రభావంతో..

ధరల పెరుగుదల వెనుక మూడు ప్రధాన కారణాలు కనిపిస్తున్నాయి. ఎల్‌నినో ప్రభావంతో వానాకాలం వరి సాగు గతేడాది ఈసారి భారీగా తగ్గింది. భవిష్యత్తులో కొరత వస్తుందనే అంచనాతో పెద్ద వ్యాపారులు, మిల్లర్లు గోదాముల్లో వేల క్వింటాళ్లు నిల్వ చేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పథకం కోసం 148 లక్షల టన్నులలో 70 లక్షల టన్నులు కొనుగోలు చేయడం, రూ.500 బోనస్ ఇవ్వడంతో రైతులు ప్రభుత్వానికే అమ్ముతున్నారు. దీంతో బయట మార్కెట్‌కు సరుకు తగ్గింది. దీంతో రేట్లు భారీగా పెరిగాయి. ప్రభుత్వం వెంటనే నిల్వలపై దాడులు చేసి ధరలు అదుపు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కృత్రిమ కొరత సృష్టిస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



భిక్కనూరులోనే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మించాలి

అక్షరటుడే, భిక్కనూరు: మండల కేంద్రంలోనే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను నిర్మించాలని కోరుతూ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు సోమవారం ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీకి వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంలోని సిద్ధిరామేశ్వర స్వామి ఆలయం సమీపంలో అయ్యప్ప స్వామి ఆలయం వెనుక జాతీయ రహదారి నుంచి సుమారు 800 మీటర్ల దూరంలో 35 ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందని వారు అన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన సుమారు రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి అవసరమైన సాంకేతిక పరిశీలన చేపట్టేందుకు టెక్నికల్ టీమ్‌ను భిక్కనూర్‌కు పంపించాలని కోరారు. షబ్బీర్ అలీ మాట్లాడుతూ భిక్కనూర్‌లోనే ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. నాగన్న గారి నరేందర్ రెడ్డి, బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, మద్ది చంద్రకాంత్ రెడ్డి, బల్యాల రేఖ సుదర్శన్ పాల్గొన్నారు.



రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్‌గా పోతన్‌కర్ లక్ష్మీనారాయణ

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్‌గా పోతన్‌కర్ లక్ష్మీనారాయణ ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎన్నికల అధికారి, డీసీపీ శ్రీనివాస్ పాలకవర్గంతో సోమవారం రెడ్‌క్రాస్ సొసైటీ లో ప్రమాణస్వీకారం చేయించారు. వైస్ చైర్మన్‌గా డాక్టర్ సీనునాయక్, ట్రెజరర్‌గా కెంపుల నాగరాజు, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా జెస్సు అనిల్ ఎన్నికయ్యారు. మొత్తంగా 15మందితో సొసైటీ పాలవకర్గం ఏర్పడింది. బుస్సా ఆంజనేయులు ప్యానెల్‌లో 14మంది పోటీపడగా నలుగురు, ఇందూరు సేవాసమితి ప్యానెల్‌లో 15మంది పోటీలో ఉండగా 11మంది గెలిచారు.



పోలీస్ ప్రజావాణికి 43 ఫిర్యాదులు

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: నగరంలోని సీపీ కార్యాలయంలో సోమవారం పోలీస్‌ప్రజావాణి నిర్వహించారు. ఈ మేరకు సీపీ సాయిచైతన్య బాధితుల నుంచి 43 ఫిర్యాదులు స్వీకరించారు. బాధితులతో సీపీ ప్రత్యక్షంగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత పోలీస్‌స్టేషన్ల సీఐలు, ఎస్సైలకు చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఫిర్యాదుదారులు నిర్భయంగా సీపీ కార్యాలయానికి వచ్చి తమ సమస్యలను తెలుపవచ్చన్నారు. మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా రావాలని.. వారి సమస్యలను చట్టపరంగా పరిష్కరిస్తామన్నారు. ప్రజావాణి ఫిర్యాదులను వేగంగా పరిష్కరిస్తామన్నారు. పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా పోలీస్ శాఖ పని చేస్తుందని వివరించారు.

కరెంట్ కోతలపై రైతుల ఆగ్రహం



అక్షరటుడే, కామారెడ్డి: కరెంట్ కోతలపై పాల్వంచ మండల రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కామారెడ్డి -సిరిసిల్ల ప్రధాన రహదారిపై సోమవారం రాస్తారోకో చేశారు. మండలంలోని వెల్పుగొండ, ఫరీద్ పేట విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలోని పదులసంఖ్యలో గ్రామాల రైతులు సోమవారం ఉదయం కామారెడ్డి - సిరిసిల్ల ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. దీంతో గంటపాటు రాకపోకలు స్తంభించాయి. ప్రభుత్వం వ్యవసాయ రంగానికి కేవలం 12 గంటల విద్యుత్ సరఫరా చేస్తుండటం, అందులోనూ నాణ్యత లోపించడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వోల్టేజ్ హెచ్చుతగ్గులతో పంపుసెట్లు కాలిపోతున్నాయని, మోటార్లు రిపేర్ చేయించడానికే వేల రూపాయలు ఖర్చవుతోందని వాపోయారు. సరైన సమయంలో నీరు అందక పంటలు ఎండిపోతున్నాయని, ఇటు పంటనష్టం, అటు ఆర్థికభారం మోయలేకపోతున్నామని అన్నారు. 12 గంటల కరెంటులో కూడా సాంకేతిక కారణాలు, లైన్ మెయింటెనెన్స్, ట్రిప్పింగ్ పేరుతో అంతరాయం ఏర్పడడంతో 10 గంటలు కూడా పూర్తిస్థాయిలో విద్యుత్ రావడం లేదని రైతులు పేర్కొన్నారు. రాత్రిపూట కరెంట్ ఇవ్వడం వల్ల పొలాల వద్దకు వెళ్లడానికి భయపడాల్సి వస్తోందన్నారు. మొన్నటి వరకు యూరియా కోసం క్యూలైన్లలో నిలబడ్డామని, ఇప్పుడు కరెంటు కోసం రోడ్డెక్కాల్సి వస్తోందన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు, ఎస్పీడీసీఎల్ ఏఈ, డీఈలు ఘటనా స్థలానికి చేరుకుని రైతులతో చర్చలు జరిపారు. విద్యుత్ సమస్యను పరిష్కరిస్తామని, నాణ్యమైన కరెంట్ ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

నేర నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలి



అక్షరటుడే, కామారెడ్డి: నేర నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించి ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నెలవారీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. లాంగ్ పెండింగ్, మిస్సింగ్ కేసుల ఛేదన, ఎన్‌బీడబ్ల్యూ ఎగ్జిక్యూషన్‌పై ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలన్నారు. గ్రేవ్ కేసుల్లో శాస్త్రీయ, సాంకేతిక ఆధారాలతో సమర్థవంతమైన దర్యాప్తు చేపట్టి నిందితులకు శిక్ష పడేలా చూడాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు హాట్‌స్పాట్‌లను గుర్తించి ప్రమాద సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఆర్థిక, సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. దుర్గా నవరాత్రుల సందర్భంగా ముందస్తు ప్రణాళికలు రూపొందించి పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని, మహిళల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ షీటీమ్స్ నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అదనపు ఎస్పీ నర్సింహారెడ్డి, డీఎస్పీలు మధుసూదన్, శ్రీనివాసరావు, గట్టుమల్లు, విజయభాస్కర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ మురళి తదితరులు పాల్గొన్నారు.

ఏకలవ్య పాఠశాలను రాష్ట్రస్థాయిలో నంబర్‌వన్‌గా నిలపాలి: కలెక్టర్



అక్షరటుడే, కామారెడ్డి: గాంధారి ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలను రాష్ట్రస్థాయిలో నంబర్ వన్‌గా నిలిపేందుకు కృషి చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాల జిల్లాస్థాయి పాలక మండలి సమావేశంలో సోమవారం ఆయన పాఠశాల ప్రగతిపై సమీక్షించారు. పాఠశాలలోని సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కరించాలని, జిల్లాస్థాయి పాలక మండలి సభ్యులు వారానికి ఒకరు చొప్పున పాఠశాలను సందర్శించి నివేదిక సమర్పించాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలలో చేపడుతున్న ఇంజినీరింగ్ పనులను ఈ నెలలోనే పూర్తి చేస్తామని డీఈఈ సంపత్ కుమార్ వివరించారు. అనంతరం హిమాచల్ ప్రదేశ్‌లోని 6,021 మీటర్ల ఎత్తయిన తరంగ్ 2 పర్వతాన్ని అధిరోహించిన గిరిజన విద్యార్థి బన్నీని కలెక్టర్ సన్మానించారు. రాజంపేట మండలం ఎల్లాపూర్ తండాకు చెందిన విశ్లావత్ బన్నీ కామారెడ్డిలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో బీకాం ఫైనలియర్ చదువుతూ ఈ ఘనత సాధించాడు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యతో పాటు సాహస క్రీడల్లోనూ ప్రతిభ కనబరుస్తూ జిల్లాకు గుర్తింపు తీసుకురావడం అభినందనీయమని పేర్కొన్నారు. బన్నీ విజయాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఇతర విద్యార్థులు కూడా తమ ప్రతిభను వివిధ రంగాల్లో చాటాలని ఆకాంక్షించారు. కార్యక్రమాల్లో జిల్లా పరిషత్ సీఈవో చందర్ నాయక్, ప్రాంతీయ సమన్వయ అధికారి గంగారాం నాయక్, జిల్లా సంక్షేమాధికారి సౌజన్య, ప్రధానాచార్యులు శ్యామలదేవి, అమర్ సింగ్, మాధవరావు, రవీంద్ర కుమార్, సంతోష్ శుక్లా, సంబంధిత అధికారులు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND

2

నిజామాబాద్/కామారెడ్డి
సోమవారం
5.10.2026

www.aksharatoday.in
AKSHARA TODAY

పోచంపాడ్‌లో ఘనంగా పోషణ మాసం వారోత్సవాలు



అక్షరటుడే,మెండోరా: మండలంలోని పోచంపాడ్ గ్రామంలో పోషణ మాసోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఏసీడీపీవో స్వర్ణలత పోషణ మాసం ప్రాముఖ్యత, గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు సీమంతం నిర్వహించారు. పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణపై అధికారులు, సిబ్బంది సూచనలు అందించారు. కార్యక్రమంలో పోచంపాడ్ సర్పంచ్ మాధురి, మెండోరా మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గోపాల్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధ, ఐసీపీఎస్ కౌన్సిలర్ జమ్రుద్, హెల్త్ సూపర్‌వైజర్ వనమాల, ఏఎన్ఎం మేరీ, పంచాయతీ కార్యదర్శి భోజన్న, చిన్నయ్య, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పోతంగల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



అక్షరటుడే,కోటగిరి: పోతంగల్ మండల కేంద్రంలోని విశాల సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రజాప్రతినిధులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం కల్పించిన మద్దతు ధర గ్రేడ్ ఏ, రూ. 2461, సాధారణ రకానికి రూ. 2441 పొందాలని సూచించారు. దళారులకు ధాన్యాన్ని విక్రయించి నష్టపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సందీప్, సర్పంచ్ కల్లూరి సంధ్య, హన్మాండ్లు, సొసైటీ ఇన్‌ఛార్జి రియాజుద్దీన్, మాజీ ఏఎంసీ ఛైర్మన్ గైక్వాడ్ హన్మంత్, సెక్రెటరీ శివాజీ, ఏఈవో అరుణ్, ఉప సర్పంచ్ నబీ, రైతులు, పుప్పాల శంకర్, గంధపు పవన్, గంట్ల విఠల్, కేశ వీరేశం, నీరడి గంగాధర్, జుమ్మా ఖాన్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ ఇళ్ల నిర్మాణ పనులను నిలిపివేయించాలి



అక్షరటుడే, ఆర్మూర్: పట్టణంలోని నరేంద్ర డిగ్రీ కళాశాల పక్కన అనుమతులకు విరుద్ధంగా ఇళ్లను నిర్మిస్తున్నప్పటికీ మున్సిపల్ అధికారులు పట్టించుకోవట్లేదని మున్సిపల్ మాజీ ఛైర్మన్ త్రివేణి గంగాధర్ ఆరోపించారు. ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన మాట్లాడారు. 3వ వార్డులో నరేంద్ర డిగ్రీ కళాశాల పక్కన తనకు 943 గజాల రిజిస్ట్రేషన్ స్థలం ఉందన్నారు. పుప్పాల శివరాజ్, రజిత, మగ్గిడి వెంకటేశ్‌లకు మున్సిపల్ నుంచి అనుమతులు రావడంతో తన స్థలాన్ని ఆక్రమించి ఇళ్లను నిర్మిస్తున్నారన్నారు. స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నారని టౌన్ ప్లానింగ్ అధికారి అంజనేయులుకు ఫిర్యాదు చేసినా చర్యలు చేపట్టడం లేదన్నారు. నాన్ లేఔట్ ప్లాట్‌లలో ఇళ్లను నిర్మిస్తే పక్క ప్లాట్ల యజమానుల ఎన్‌వోసీ తీసుకోవాల్సి ఉంటుందని వివరించారు. ఎన్‌వోసీ లేకుండా, పాలకవర్గానికి తెలియకుండా నిర్మాణాలు చేస్తున్నారన్నారు. ఎలాంటి సెట్ బ్యాక్ లేకుండా నిర్మాణాలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్, టీపీవో పట్టించుకోవడంలేదని చెప్పారు. ఈ విషయమై మున్సిపాలిటీలో అనేకసార్లు వెళ్లి ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు.

జిల్లాలో బార్లు బంద్



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: జిల్లావ్యాప్తంగా సోమవారం బార్లు మూసి ఉంచారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు.. విచ్చలవిడి పర్మిట్ రూంల ఏర్పాటును నిరసిస్తూ వారు ఈ నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా బార్లపై ప్రభుత్వం కొత్త నిబంధన ప్రవేశపెట్టింది. ప్రతి బార్ 10శాతం ప్రివిలేజ్ ట్యాక్స్ కట్టాలని సూచించింది. ఈ నిర్ణయాన్ని రాష్ట్ర బార్ల అసోసియేషన్ తీవ్రంగా ఖండిస్తోంది. ములిగే నక్క మీద తాటికాయ పడ్డట్లుగా ఇప్పటికే బార్లను నడిపించడంలో ఇబ్బందులు పడుతున్న తమకు ట్యాక్స్ రూపంలో ప్రభుత్వం వసూళ్లకు పాల్పడడం ఎంతమాత్రం సరైంది కాదని వారు పేర్కొంటున్నారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా వైన్స్‌ల వద్ద విచ్చలవిడిగా పర్మిట్ రూంలు ఏర్పాటు చేయడంతో బార్లకు గిరాకీ లేకుండా పోయిందని నిర్వాహకులు వాపోతున్నారు. ఒక పర్మిట్ రూం కేవలం 100 గజాల్లో ఉండాల్సి ఉండగా.. అడ్డదిడ్డంగా విశాల ప్రాంతంలో వాటిని ఏర్పాటు చేసి బార్ల పొట్టగొడుతున్నారని వారు వాపోయారు. నిబంధనలకు విరుద్ధంగా పర్మిట్ రూంలు ఏర్పాటు చేసినప్పటికీ ఎక్సైజ్ శాఖ స్పందించడం లేదని వారుఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ప్రివిలేజ్ ట్యాక్స్ తీసివేయాలని.. పర్మిట్‌రూం నిబంధనలు పక్కాగా అమలు చేయాలని కోరారు. హైదరాబాద్‌లోని ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. నిజామాబాద్ జిల్లా బార్ల అసోసియేషన్ అధ్యక్షుడు దేవన్న, కార్యదర్శి సంతోష్, విన్ను, జనార్ధర్, విశ్వనాథ్, రంజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జోరందుకున్న వరికోతలు

జిల్లావ్యాప్తంగా వరికోతలు ఊపందుకున్నాయి. ముందుస్తుగా సాగుచేసిన వరి కోతదశకు వచ్చింది. దీంతో రైతులు హార్వెస్టర్ల ద్వారా కోతపనుల్లో నిమగ్నమయ్యాయి. కోతలు పూర్తయిన వెంటనే పొలాల వద్దే దళారులు కాంటాలు వేసి కొనుగోళ్లు చేస్తున్నారు. ఎడపల్లిలో యంత్రాల సాయంతో వరికోతల దృశ్యాలివి.. – అక్షరటుడే, బోధన్





తాళ్లరాంపూర్ వీడీసీపై చర్యలు తీసుకోవాలి



అక్షరటుడే, ఆర్మూర్: తాళ్లరాంపూర్ వీడీసీపై వెంటనే చర్యలు తీసుకోవాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ, ధర్మసమాజ్ పార్టీ నాయకులు, గౌడ కుల సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలో ధర్నా నిర్వహించారు. జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కండెల సుమన్ మాట్లాడుతూ.. ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్ గ్రామంలో వీడీసీ వారు 39 గీత కార్మిక, 11 దళిత కుటుంబాలను సాంఘిక బహిష్కరణ చేశారన్నారు. ఈ విషయమై గతనెల 28న కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. వారం రోజుల్లో ఈ సమస్య పరిష్కరిస్తామని పేర్కొన్నారని ఇప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. దీంతో డాక్టర్ విశారదన్ మహారాజ్ ఆదేశాల మేరకు జేఏసీ, గౌడ, డీఎస్పీ ఆధ్వర్యంలో ఆర్మూర్ పట్టణంలో నిరసన కార్యక్రమం చేపట్టామన్నారు. రాజ్యాంగ విరుద్ధమైన వీడీసీలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వీడీసీ ముసుగులో కొందరు బీసీ,ఎస్సీ ఎస్టీలపై పెత్తనం చెలాయిస్తూ బహిష్కరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ సంఘటనపై ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ రెడ్డి బాధితుల పక్షాన లేకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వారు వినతిపత్రం అందజేశారు. జేఏసీ జిల్లా అధ్యక్షుడు రామా గౌడ్, ప్రేమ్, మహిపాల్, మెడ గంగారాం, సుదర్శన్, మురళి, ఉమేష్, మహేష్, భుమేష్, మహిపాల్, మహేష్, నర్సా గౌడ్ పాల్గొన్నారు.

ప్రజావాణిలో నమోదైన సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత



అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్: ప్రజావాణి లో ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ వి భుజంగరావు అధికారులకు సూచించారు. ఈ మేరకు నగరంలోని కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 107 ఫిర్యాదులు అందాయని వివరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జెడ్పీ సీఈవో సాయాగౌడ్, డీఆర్డీవో సాయన్న, డీపీవో శ్రీనివాస్ రావు, నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ చంద్రశేఖర్‌లు స్వీకరించారు. సమాచార హక్కు చట్టం వారోత్సవాలను పురస్కరించుకుని ప్రజలకు జిల్లా, డివిజన్, మండల స్థాయిలలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అదనపు కలెక్టర్ భుజంగరావు సూచించారు. ప్రజావాణి అనంతరం ఆయన మాట్లాడుతూ, ఈనెల 5 నుండి 12వ తేదీ వరకు ఆర్టీఐ వారోత్సవాలను అన్ని స్థాయిలలో నిర్వహిస్తూ, సమాచార హక్కు చట్టం పట్ల ప్రజల్లో చైతన్యం పెంపొందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్మైల్స్ ది స్కూల్‌లో ఉపాధ్యాయులకు సన్మానం



అక్షరటుడే, ఆర్మూర్: పట్టణంలోని స్మైల్స్ ది స్కూల్ సోమవారం ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చార్టర్డ్ అకౌంటెంట్ ఈరవత్రి రాజశేఖర్ పాఠశాలకు చెందిన ఉత్తమ ఉపాధ్యాయులు సింధూర, స్వప్నలను ఘనంగా సన్మానించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని ఆయన అన్నారు. స్మైల్స్ ది స్కూల్‌లో విద్యార్థులకు అందిస్తున్న విద్యా విధానం, ఉపాధ్యాయుల అంకితభావం, పాఠశాల నిర్వహణ చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. పాఠశాల కరస్పాండెంట్ రఫీ గోహర్, ఈఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు అర్గుల్ సురేష్, రామచందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

7న అండర్–19 కబడ్డీ బాలబాలికల ఎంపికలు

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ తరపున అండర్-19 కబడ్డీ బాలబాలికల జట్ల ఎంపిక పోటీలు ఈనెల 7వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. క్రీడాకారులు ఇంటర్మీడియట్ రెగ్యులర్ ఫస్ట్, సెకండ్ ఇయర్ చదువుతూ.. 2008 జనవరి 1వ తేదీ తర్వాత పుట్టినవారు అర్హులన్నారు. 7వ తేదీ బుధవారం మధ్యాహ్నం ఒంటిగంట వరకు క్రీడాకారులు తమ ధృవపత్రాలతో కామారెడ్డి బాలుర ట్రైబల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాలలో రిపోర్ట్ చేయాలని సూచించారు. వివరాలకు సత్యనారాయణ (94405 72314)ను సంప్రదించాలని కోరారు.

వీడీసీ వ్యవస్థను రద్దు చేయాలి



అక్షరటుడే,నిజామాబాద్ సిటీ: జిల్లాలో వీడీసీ వ్యవస్థను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఏఐపీఎస్‌యూ, బీవీఎం విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు అడిషనల్ కలెక్టర్ భుజంగరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విగ్నేష్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి అనిల్, ఏఐపీఎస్‌యూ జిల్లా కార్యదర్శి బోడ అనిల్ మాట్లాడుతూ వీడీసీ వ్యవస్థలను రద్దు చేసి బాధిత కుటుంబాలకు రక్షణ కల్పించాలని కోరారు. వీడీసీలు సమాంతర ప్రభుత్వాలు నడుపుతున్నా, రాజ్యాంగ వ్యవస్థలు చూస్తూ ఊరుకోవడాన్ని వారు తప్పుపట్టారు. విద్యార్థి సంఘాల నాయకులు రాజు, సుశాంత్, నాగరాజు పాల్గొన్నారు.

భీమ్‌గల్ పోలీస్ స్టేషన్‌లో టీస్టాల్ యజమాని ఆత్మహత్యాయత్నం

అక్షరటుడే, భీమ్‌గల్: భీమ్‌గల్ పోలీస్ స్టేషన్‌లో ఓ టీస్టాల్ యజమాని పొలాస సుధాకర్ పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికంగా ఈ ఘటన కలకలం రేపింది. పోలీసుల వేధింపుల కారణంగానే సుధాకర్ ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడని ఆయన కుటుంబ సభ్యులు, అఖిలపక్ష నాయకులు ఆరోపించారు. మరోవైపు ఈ ఘటనకు పోలీసులకు ప్రత్యక్ష సంబంధం లేదని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. వివరాల్లోకి వెళ్తే.. భీమ్‌గల్ బస్టాండ్ సమీపంలో టీ స్టాల్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్న సుధాకర్‌ను రాత్రి వేళల్లో టీ విక్రయిస్తున్నాడనే కారణంతో పోలీసులు పలుమార్లు ఇబ్బందులకు గురిచేశారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఇప్పటికే పలుమార్లు పెట్టీ కేసులు, జరిమానాలు విధించారని, మరోసారి పోలీస్ స్టేషన్‌కు రావాలని చెప్పడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడని తెలిపారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం సుమారు 9.45 గంటల సమయంలో పెట్రోల్‌తో పోలీస్ స్టేషన్‌కు వచ్చిన సుధాకర్ తన ఒంటిపై పెట్రోల్ పోసుకుని



నిప్పంటించుకున్నాడు. వెంటనే అక్కడున్న పోలీసులు, ఇతరులు మంటలను ఆర్పి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

అఖిలపక్షం ఆందోళన

ఘటన అనంతరం సుధాకర్ కుటుంబ సభ్యులు భీమ్‌గల్ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు వారికి మద్దతు తెలిపారు. ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుని బాధితుడికి మెరుగైన చికిత్స అందించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై బాల్కొండ మాజీ ఎమ్మెల్యే,



మాజీమంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి స్పందించారు. పేద టీ వ్యాపారి సుధాకర్ పోలీసుల వేధింపులు తాళలేక పోలీస్ స్టేషన్‌లోనే ఆత్మహత్యాయత్నం చేయడం బాధాకరమని పేర్కొన్నారు. బాధితుడికి మెరుగైన వైద్యం అందించాలన్నారు.

పోలీసుల వివరణ

అయితే సీపీ సాయిచైతన్య మాట్లాడుతూ.. సుధాకర్‌కు మరో వ్యక్తితో ఉన్న వివాదం, అతని టీ స్టాల్‌లో రాత్రి వేళల్లో వ్యాపారం నిర్వహించడం తదితర అంశాలపై పోలీసులు పెట్టీ కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఆ కేసులో రిమాండ్‌కు వెళ్లి బెయిల్‌పై వచ్చిన సుధాకర్, అదే విషయాన్ని మనసులో పెట్టుకుని పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని తెలిపారు. ఈ ఘటనలో పోలీసు వ్యవస్థకు లేదా పోలీసు సిబ్బందికి ప్రత్యక్ష సంబంధం లేదని పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారు.